సాక్షి
కర్నూలు
సోమవారం ; 11 ; మార్చి ; 2024



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై ఆదివారం హైదరాబాద్, విజయవాడకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.



అన్నదానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన బి.సాయి కుమారి రూ.1,01,116, వనపర్తికి చెందిన వై.వెంకటరెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవ యాగాలకు ఆదివారం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. పూజాద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు.

8లో▸

న్యూస్‌రీల్

మంత్రాలయం మీదుగా బెంగళూరుకు 'వందే భారత్'



కోసిగి: కర్ణాటక రాష్ట్రం కలబురగి నుంచి బెంగళూరుకు వెళ్లే వందే భారత్ రైలు మంత్రాలయం రోడ్డు రైల్వేస్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రైలును ఈనెల 12న ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైలు నంబర్ 22231 కలబురగిలో ఉదయం 5.15 గంటల బయలు దేరి రాయచూరుకు 6.53 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి మంత్రాలయం రోడ్డుకు 7.08గంటకు వస్తుందని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి 7.10 గంటలకు బయలు దేరి గుంతకల్లుకు 8.25, అనంతపురానికి 9.28 గంటలకు, బెంగళూరుకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. బెంగళూరు నుంచి రైలు నంబర్ 22232 మధ్యాహ్నం 2.40 గంటలకు బయలు దేరి అనంతపురానికి 5.58, గుంతకల్లుకు 7, మంత్రాలయం రోడ్డుకు 8.15గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. కలబురగికి 23.30 గంటలకు వెళ్తుందని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

వైబ్‌సైట్లలో మెరిట్ జాబితా

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి 14 కేటగిరీల్లో పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న 10 కేటగిరీల అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాను https://kurnool.ap.gov.in,https://nandyal.ap.gov.in,https://kurnoolmedicalcollege.ac.in వైబ్‌సైట్లలో అప్‌లోడ్ చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినర్సమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ లిస్టును వివరాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు కర్నూలు మెడికల్ కాలేజీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆర్వోలు, నోడల్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బుధవారం లోపు నియోజకవర్గాల నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి కావాలన్నారు. నామినేషన్, స్క్రూటీని, కోడ్ అమలు అంశాలపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. సెక్టార్ అధికారులకు వాహనాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌కు సంబంధించి ప్రతి అంశంపై రాజకీయ పార్టీల ఆమోదం ఉండాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పాల్గొన్నారు.

నాడు గోల్'మాల్'.. నేడు లాభాల 'మార్ట్'

- టీడీపీ హయాంకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడా చూస్తున్న మహిళలు
- చంద్రన్న మాల్స్ పేరుతో అప్పట్లో దోపిడీ
- ప్రస్తుతం మహిళలకు అండగా నిలుస్తున్న మహిళా మార్ట్‌లు
- మహిళల భాగ్యస్వామంతో నిర్వహణ
- నరసమైన ధరలతో నాణ్యమైన వస్తువులు
- లాభాలు గడిస్తున్న పొదుపు సంఘాల సభ్యులు



చేయూత మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న మహిళలు

కోడుమూరు: టీడీపీ హయాంలో అవినీతి రాజ్యమేలింది. ప్రజా సంక్షేమాన్ని మరచి 'పచ్చ' పార్టీ నేతలకు, కార్యకర్తలకు లబ్ధి చేకూరేలా అప్పట్లో పాలన సాగింది. చంద్రన్న మాల్స్‌ను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. చేయూత మహిళా మార్ట్‌లనే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

టీడీపీ హయాంలో ఇలా..

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2017లో కర్నూలు, కోడుమూరు, ఆళ్లగడ్డ, ఆలూరు, బనగానపల్లె, ఎమ్మిగనూరు, పాణ్యం మండల కేంద్రాల్లో చంద్రన్న మాల్స్ ఏర్పాటు చేశారు. వీటిని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే నిర్వహించారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రిలయన్స్ సంస్థ చంద్రన్న మాల్స్‌కు సరుకులు అప్పుగా ఇవ్వాలన్నది నిబంధన. సరుకులు అమ్మి, తిరిగి డబ్బులు సదరు సంస్థకు చెల్లిస్తే కావాల్సినంత సరుకులు అప్పు ఇచ్చే విధంగా అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. టీడీపీ కార్యకర్తలు అప్పుగా ఇచ్చిన సరుకులను అమ్ముకొని సరఫరా చేసిన సంస్థకు డబ్బులు చెల్లించకుండా కాజేశారు. అంతేకాకుండా మార్కెట్ ధర కంటే అధిక రేట్లకు సరుకులను అమ్మారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు చంద్రన్న మాల్స్ ఆరు నెలలకే మూతబడ్డాయి. చంద్రన్న మాల్ నిర్వాహకులు రిలయన్స్ సంస్థకు డబ్బులు చెల్లించాలని అప్పట్లో సివిల్ సప్లై అధికారులు నోటీసులు సైతం ఇచ్చారు.



కోడుమూరులో మూతబడిన చంద్రన్న మాల్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

మహిళలు వ్యాపార రంగంలో ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలు జిల్లాలో కోడుమూరు, నంద్యాల జిల్లాలోని బేతంచర్లలో చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయించింది. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలంతా రూ.28లక్షలు పోగు చేసుకొని 2022 అక్టోబర్‌లో కోడుమూరు పట్టణం రామచంద్ర టాకీస్ వెనుక విశాలమైన భవనంలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వివిధ కంపెనీల సరుకులను కొనుగోలు చేసి తక్కువ ఆదాయం తీసుకుంటూ మార్కెట్‌కంటే తక్కువ ధరకే ఇక్కడ అమ్ముతున్నారు. బ్రాండ్‌లు, ధరల డిస్కౌంట్ తెలిపే పట్టికలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు సరుకులను కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ఇక్కడ రోజు సగటున రూ.50వేల వరకు వ్యాపారం జరుగుతోంది. 2024 జనవరి నాటికి రూ.2 కోట్లకు పైగా టర్నోవర్ జరిగింది. ఈ మార్ట్ నుంచి వచ్చే లాభాలు పొదుపు సంఘాల్లో ఉన్న ప్రతి మహిళకు చేరే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిబంధన విధించింది. పొదుపు సంఘాల మహిళలు కూడా తమ ఇంటికి కావాల్సిన వస్తువులన్నీ ఈ మార్ట్‌లో కొనుగోలు చేస్తున్నారు. మార్ట్ నిర్వహణపై అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రన్న మాల్స్ కేవలం టీడీపీ కార్యకర్తల జేబులు నింపేందుకు ఏర్పాటు చేశారు. అధిక ధరలతో సరుకులను సరఫరా చేస్తుండడంతో చంద్రన్న మాల్స్ ఆరు నెలలకే ఎత్తిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ విజయవంతంగా నడుస్తున్నాయి. లాభాల బాటలో దూసుకుపోతున్నాయి. రోజురోజుకూ వీటికి ఆదరణ పెరుగుతోంది.

సరుకుల నాణ్యత బాగుంది



కోడుమూరు మహిళా మార్ట్‌లో సరుకుల నాణ్యత బాగుంది. ఇతర కిరాణా షాపులతో పోలిస్తే ఇక్కడ సరుకుల తక్కువ ధరకు దొరుకుతున్నాయి. మా ఇంటికి అవసరమైన సరుకులన్నీ ఇక్కడే కొనుగోలు చేస్తున్నా.

– జ్యోతి, పొదుపు సంఘం సభ్యురాలు

లాభాల్లో నడుస్తోంది



కోడుమూరులో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్ లాభాల్లో నడుస్తోంది. పొదుపు సంఘాల్లోని ప్రతి మహిళ నుంచి రూ.200 సేకరించి దాదాపు రూ.28 లక్షలతో మార్ట్‌ను ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సలహాలు సూచనలతో మార్ట్‌ను నడుపుతున్నాం. ప్రారంభంలోనే మంచి ఫలితాలు సాధించాం. ఇప్పటివరకు రూ.2 కోట్లకు పైగా టర్నోవర్ జరిగింది. రోజుకు సగటున రూ.50 వేల వరకు మార్ట్‌లో వ్యాపారం జరుగుతోంది. – పుష్పావతి, ఏపీఎం, కోడుమూరు

పగిడిరాయి వద్ద చిరుత సంచారం

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయి వద్ద చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో వెళ్తుండగా చిరుత కనిపించినట్లు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆదివారం డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, బీట్ ఆఫీసర్ లక్ష్మన్న గ్రామానికి వెళ్లి చిరుత పాద ముద్రలను పరిశీలించారు. నీటి కోసం చిరుత వచ్చి ఉండవచ్చునని, గ్రామస్తులు భయాందోళన చెందవద్దని ఫారెస్టు అధికారులు సూచించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



పి కోటకొండలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు వివరిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర సాయుధ బలగాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. కర్నూలుతో పాటు ఎమ్మిగనూరు, పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం కవాతు నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ పర్యవేక్షణలో కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్ పరిధిలోని ఆర్ కొంతలపాడు, ఉల్చాల గ్రామాలలో సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అలాగే ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పర్యవేక్షణలో ఎమ్మిగనూరు టౌన్, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో కవాతు నిర్వహించారు. దేవనకొండ, కుంకనూరు, వెలమకూరు, పి కోటకొండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో కూడా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు.

పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి రోజా, ఎంపీ పోచా, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి

- మంత్రి ఆర్కే రోజా

ఆళ్లగడ్డ: రాష్ట్రంలో పురాతన కట్టడాలు, చారిత్రక ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పార్వేట మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ సందర్భంగా ఆదివారం మంత్రి రోజా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా దిగువ అహోబిలం చేరుకున్న మంత్రి రోజా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డికి అహోబిలం ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం వారు ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ ప్రహ్లాద వరదస్వాముల అభిషేకంలో పాల్గొన్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం మంత్రికి వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ పురాతన క్షేత్రాలు, ఆలయాల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అహోబిలం దేవస్థానం అభివృద్ధికి రూ. 25 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో క్షేత్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కర్నూలు జిల్లాలో 8 కేంద్రాలు, నంద్యాల జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 5వ తరగతికి సంబంధించి 11వేల మంది విద్యార్థులకు గాను 9,639 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 7,551 మంది విద్యార్థులకు గాను 6,560 మంది హాజరయ్యారు. కర్నూలు పరీక్ష కేంద్రాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల పర్యవేక్షకులు శ్రీనివాసరావు పరిశీలించారు. నంద్యాల జిల్లా ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా గురుకుల పాఠశాల కో ఆర్డినేటర్ డి.రామసుబ్బారెడ్డి పరిశీలించారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరిగినట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు.



వెల్దుర్తిలో గురుకుల పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మహానందిలో అశేష భక్తజనం మధ్య రథోత్సవం



హరహర మహాదేవ



రథంలో ఆశీనులైన మహానందీశ్వరుడి దంపతులు

- కమనీయం మహానందీశుడి రథోత్సవం
- తరలివచ్చిన అశేష భక్తజనం

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో మహానందీశ్వరుడి రథోత్సవం ఆదివారం మహానందంగా సాగింది. రథాన్ని లాగేందుకు భక్తజనం పోటీపడ్డారు. వేలాది మంది భక్తులు హర హర మహాదేవ... శంభో శంకర...శ్రీ మహానందీశ్వరస్వామికీ జై... శ్రీ కామేశ్వరీదేవి మాతాకీ జై.... అంటూ నినదిస్తుండగా రథోత్సవం సాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, మహానంది తహసీల్దార్ రామచంద్రుడు, నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, కల్యాణోత్సవ దాత లక్కబోయిన ప్రసాద్, తెప్పోత్సవం దాత ఏజీఎస్ జువెలర్స్ అవ్వారు గౌరీనాథ్ దంపతులు రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. మహానందీశ్వరస్వామి కల్యాణం అనంతరం శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు పెళ్లి పెద్దలైన శ్రీ పార్వతీ సహిత బ్రహ్మనందీశ్వర స్వామి వారితో కలిసి రథంలో ఆశీనులై ఆలయ మాడవీధుల చుట్టూ విహరించారు. ముందుగా రథం వద్ద వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, రుత్వికుల ఆధ్వర్యంలో రథంగా పూజ, కూష్మాండబలి పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన వీరయ్య ఆచారి, నాగభూషణం ఆచారిలు కుంభాహుతిని సంప్రదాయంగా తీసుకుని వచ్చి రథానికి సమర్పించారు. రథోత్సవంలో ఏఈఓలు ఎర్రమల మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

- హెక్టారుకు నాలుగేళ్లలో రూ.21 వేల రాయితీ
- సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డిలో సాగుకు శ్రీకారం
- మరిన్ని మండలాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు



సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామ సమీపంలో సాగైన ఆయిల్‌పామ్

కర్నూలు(అగ్రికల్చర్): ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగును ప్రోత్సహించేందుకు రాయితీలు ఇస్తోంది. సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామంలో కొందరు రైతులు తెలంగాణ రాష్ట్రంలో అధ్యయనం చేసిన తర్వాత ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారు. తాజాగా ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. రానున్న రోజుల్లో మరిన్ని మండలాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడానికి ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది.

13 మండలాల్లో సాగుకు అవకాశం...

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు జిల్లాలోని 13 మండలాల్లోని 47 గ్రామాలు అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆదోని, సి.బెళగల్, గోనెగండ్ల, హొళగుందద, కోసిగి, కౌతాళం , కర్నూలు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు, హాలహర్వి, కృష్ణగిరి మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మండలాలకు కంపెనీలను ఆలాట్ చేసింది. పతంజలి ఫుడ్ లిమిటెడ్‌కు సి.బెళగల్, గోనెగండ్ల, నవభారత్ లిమిటెడ్‌కు ఆదోని, కృష్ణగిరి, కర్నూలు, ఎమ్మిగనూరు మండలాలు, లివింగ్ ఫుడ్స్‌కు హాలహర్వి, హొళగొంద, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు మండలాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సి.బెళగల్ మండలంలో ఆయిల్‌పామ్‌కు శ్రీకారం చుట్టారు.

హెక్టారుకు రూ.21 వేలు రాయితీ

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.21 వేలు రాయితీ ఇస్తోంది. మెయిన్‌టెనెన్స్ కోసం ఈ రాయితీ ఇస్తోంది. ఏడాదికి రూ.5,250 ప్రకారం నాలుగేళ్ల ఈ రాయితీ లభిస్తోంది. నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్‌సీడ్స్ అండ్ ఆయిల్‌పామ్ (ఎన్ఎంవోవోపీ) రాయితీ ఇస్తోంది. ఆయిల్‌సీడ్ సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను రైతుల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం ఉద్యాన యంత్రాంగాన్ని ఆదేశించింది. ఆయిల్‌పామ్ సాగుకు నీరు అవసరం ఎక్కువగా ఉంటుంది. నీటిపారుదల సదుపాయం ఉన్న ప్రాంతాల్లో సాగు చేపట్టవచ్చు. వరి సాగు ఉన్న అన్ని ప్రాంతాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమేనని ఉద్యానశాఖ అభిప్రాయపడుతోంది. జిల్లాలో ఉన్న వాతావరణ పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాత జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అవకాశం ఉందని ఉద్యానశాఖ నిర్ధారణకు రావడంతో ప్రభుత్వం రాయితీలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం విశేషం. ఆయిల్‌పామ్ సాగుకు ఏడాది పొడవునా నీరు అవసరం ఉంటుంది. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండాలి.

ఎరువులు ఇలా వాడాలి...

హెక్టారుకు ఆయిల్ సీడ్ మొక్కలు 143 నాటుకోవచ్చు. మొదటి ఏడాది యూరియా మొక్కకు 870 గ్రాములు, రెండో ఏడాది 1,740 గ్రాములు, సింగల్ సూపర్ పాస్ఫేట్ మొదటి ఏడాది మొక్కకు 1,250 గ్రామాలు, రెండవ ఏడాది 2,500 గ్రాములు, ఎంవోపి మొదటి ఏడాది మొక్కకు 667 గ్రాములు, రెండవ ఏడాది 1,333 గ్రాములు ప్రకారం వాడాలి. 3,4 ఏళ్లలో యూరియా మొక్కకు 2,610 గ్రాములు, ఎస్ఎస్‌పీ 3,750 గ్రాములు, ఎంవోపీ 2,000 గ్రాముల ప్రకారం వినియోగించాలి. వీటికి అదనంగా సిఫారసు చేసిన ప్రకారం సూక్ష్మ పోషకాలు కూడా వాడాలి.

అవగాహన పెంచుతున్నాం



జిల్లాలో వాతావరణ పరిస్థితులు ఆయిల్‌పామ్ సాగుకు అనువుగా ఉన్నాయి. జిల్లాలో 13 మండలాల్లోని 47 గ్రా మాల్లో సాగుకు అవకాశం ఉన్నట్లు గుర్తించాం. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన పెంచుతున్నాం.

– పి. రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు



కాల్వబుగ్గ.. ఉత్సవ శోభితం

ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గలో రామలింగేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం కనులపండువగా సాగింది. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. రథంపైకి భక్తులు పూలు, పండ్లు విసురుతూ హరహర మహాదేవ అంటూ నినదించారు.



బ్రహ్మగుండం.. భక్తిపారవశ్యం

శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం క్షేత్రంలో ఆదివారం గంగా, గౌరీ సమేత బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన భక్తులు ఉత్సవాన్ని కనులారా తిలకించి పులకించారు.



యాగంటి.. మురిసిన ముక్కంటి

బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి రథోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి

- చండీశ్వరునికి త్రిశూల స్నానం, ధ్వజ అవరోహణ కార్యక్రమం
- నేడు స్వామిఅమ్మవార్లకు అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో ఈనెల 1వ తేదీన ప్రారంభించిన శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవ యాగాలకు ఆదివారం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. యాగశాలలో వేదపండితులు ఉత్సవ ముగింపు క్రతువులకు శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారి యాగశాలలో వేదపండితులు చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి రుద్రహోమ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృందం, త్రిశూలస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతిలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు వంటి పూజాద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు. వసంతోత్సవంలో అర్చకులు, పండితులు వసంతాన్ని (పసుపు, సున్నం కలిపిన మంత్రపూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. చండీశ్వరుడికి సరస్వి పుష్కరిణి వద్ద ఆగమశాస్త్రబద్ధంగా స్నానాదికాలు జరిపారు. చివరిగా త్రిశూలస్నానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సూచికంగా ధ్వజ పటాన్ని అవరోహణ చేశారు. ఉత్సవాల మొదటిరోజు బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై అవిష్కరింపజేసిన ధ్వజపటాన్ని అవరోహణ చేయడం ఆనవాయితీ.



పూర్ణాహుతి క్రతువులు నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు, పాల్గొన్న చైర్మన్, ఈఓ

సదస్యం–నాగవల్లి:

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో స్వామివారి నిత్యకల్యాణ మండపంలో సదస్యం–నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదస్వస్తి నిర్వహించారు. వేదస్వస్తిలో వేదపండితులు చతుర్వేద పారాయణంలో స్వామిఅమ్మవార్లను స్తుతించారు. నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి రోజున కల్యాణోత్సవం జరిపించిన భ్రమరాంబాదేవికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎం.విజయలక్ష్మీ, తస్నీరు ధర్మరాజు, రామమోహన్‌నాయుడు, ఏఈవోలు హరిదాసు, ప్రధానార్చకులు వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.



పుష్కరిణిలో చండీశ్వరస్వామికి త్రిశూలస్నానం

నేడు అశ్వవాహనసేవ

బ్రహ్మోత్సవాల చివరి రోజు సోమవారం సాయంత్రం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారికి అశ్వవాహనసేవ, ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ఊరేగింపు జరుపుతారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాలు పూర్తవడంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



సదస్యం – నాగవల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



ధ్వజ పటాన్ని అవరోహణ చేస్తున్న ఈఓ పెద్దిరాజు

రూ.6 కోట్లతో జంబోషెడ్

- 155 మీటర్ల వెడల్పు, 21 మీటర్ల వెడల్పుతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల కష్టాలు తొలగాయి. జంబోషెడ్ నిర్మాణంతో వర్షం వచ్చినా పంటలు తడవకుండా అమ్ముకునే వెసలుబాటు లభించింది. రూ.6 కోట్లతో నిర్మించిన జంబోషెడ్‌ను సోమవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించనున్నారు. గతంలో మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న షెడ్లు దెబ్బతినడంతో రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. చిన్న వర్షం వచ్చినా పంటలు తడిచిపోయేవి. దీంతో పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శిథిలావస్థకు చేరిన షెడ్ల స్థానంలో జంబోషెడ్ నిర్మాణానికి మార్కెటింగ్ శాఖతో రూ.6 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో 155 మీటర్ల పొడవు, 21 మీటర్ల వెడల్పుతో జంబోషెడ్ నిర్మాణపు పనులు 2023 జూన్‌లో ప్రారంభించారు. ఏడాదిలోపే నిర్మాణపు పనులు పూర్తయ్యాయి. ఇందులో 200 మంది రైతులు దాదాపు 300 టన్నుల పంట ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం ఏర్పడింది. కాగా.. పై నుంచే వచ్చే మురుగు నీరు మార్కెట్ యార్డులోకి కింది భాగంలో మడుగుగా నిలిచేవి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్య కూడా పరిష్కారం లభించింది.



మార్కెట్ యార్డులో పూర్తయిన జంబోషెడ్

కుందూలో మునిగి అక్క, తమ్ముడు మృతి

రాజుపాళెం/చాగలమర్రి: నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందికి షేక్ ఇమాంబీ (27), ఆమె తమ్ముడు పక్కీర మస్తాన్ (26) కుందూనదిలో మునిగి ఆదివారం మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు షేక్ ఇమాంబీకి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో పలు ఆలయాలు, దర్గాల వద్ద ప్రార్థనలు చేస్తుండేవారు. అమావాస్య ఆదివారం కావడంతో శిరివెళ్ల మండలంలో ఓ దర్గా వద్ద ప్రార్థనలు చేసి స్నానమాచరించి ఇంటికి వెళ్లాలని కొందరు సూచించారు. దీంతో ఇమాంబీ, ఆమె భర్త ఖాజా, పక్కీర మస్తాన్ వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలం కూలూరు గ్రామ సమీపంలోని కుందూ నది వద్దకు వెళ్లారు. కుందూ నదిలో మునిగేందుకు ఇమాంబీ, పక్కీర మస్తాన్ నీటిలో దిగగా ఊపిరి ఆడక అక్కడికక్కడే చనిపోయారు. ఇమాంబీ భర్త ఖాజా వారు ఎంత సేపటికి రాకపోవడంతో అక్కడికి వెళ్లి పరిశీలించాడు. అప్పటికే వారిరువురు మృతి చెంది ఉన్నారు. ఈ విషయాన్ని ఖాజా స్నేహితులు, బంధువులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలాన్ని ఏఎస్‌ఐ సిద్దయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఖాజా, పోలీసు క్రాంతి పరిశీలించారు. ఈ సంఘటనపై షేక్ ఖాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతురాలు ఇమాంబీకి కుమార్తె, కుమారుడు, మృతుడు పక్కీర మస్తాన్‌కు నాలుగు నెలల కుమార్తె ఉంది. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతి చెందిన అక్క, తమ్ముడు ఇమాంబీ, పక్కీర మస్తాన్

‘పది’ మూల్యాంకనంలో కోడింగ్ కీలకం

రాయచోటి: పదోతరగతి పరీక్షల మూల్యాంకనంలో కోడింగ్ అత్యంత కీలకమని ఆర్‌జేడీ రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పదోతరగతిలో కోడింగ్ విధానంపై రాయలసీమ స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమలోని ఎనిమిది జిల్లాల విద్యాశాఖ అధికారులు, అసిస్టెంట్ కమిషనర్లు, చీఫ్ కోడింగ్ అధికారులు, అసిస్టెంట్ కోడింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప ప్రాంతీయ సంచాలకులు రాఘవరెడ్డి మాట్లాడుతూ పదోతరగతి మూల్యాంకనంలో కోడింగ్ విధానంలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా, ఒక విద్యార్థి కూడా నష్టపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణలో అనుమానాలు ఉంటే ఇక్కడే తీర్చుకోవాలని తెలియజేశారు. అనంతరం రీసోర్స్ పర్సన్ సుంకర రామకృష్ణ కోడింగ్ ప్రక్రియలో మొదటిరోజు నుంచి చివరి రోజు వరకు ఎలా చేయాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

మద్యం అక్రమ రవాణా చేస్తే జైలుకే

- అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

ఆదోనిరూరల్: అక్రమంగా మద్యం రవాణా చేసేవారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామని అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపిస్తూ ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కడితోట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా విస్టా వాహనంలో 40 బాక్సుల కర్ణాటక మద్యం కనిపించిందన్నారు. మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న చిదానంద్, నరసప్ప అనే ఇద్దరు వ్యక్తులు కారును ఆపకుండా వేగంగా వెళ్తూ ప్రభుత్వ వాహనాన్ని ఢీకొట్టారని, అదుపు తప్పి ఒక బండరాయికి తగిలి వాహనం ఆగిపోయిందన్నారు. టాటా విస్టా వాహనంలోని మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న 40 బాక్సుల (ఒరిజినల్ చాయిస్ విస్కీ 3,840 టెట్రా ప్యాకెట్లు) మద్యం విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో సెబ్ సీఐ విస్నీలత, ఎస్‌ఐ ఇస్మాయిల్, సెబ్ ఇంటెలిజెన్స్ విభాగం కానిస్టేబుల్ సోమేశ్వర్, డివిజన ల్ టాస్క్‌ఫోర్స్ వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యాన్ని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న వినోద్‌కుమార్

హ్యాండ్‌బాల్ చాంపియన్ అనంతపురం

- మూడో స్థానంలో నిలిచిన కర్నూలు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీల్లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. పశ్చిమగోదావరి జిల్లా రన్నర్‌గా నిలవగా.. కర్నూలు జట్టు మూడవ స్థానాన్ని దక్కించుకుంది. కర్నూలు నగర శివారులో 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు ట్రోఫీలను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అందజేశారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, వివిధ జిల్లాల క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీని అందిస్తున్న దృశ్యం

కాల్వ పూడ్చకపోయినా మొసలి కన్నీరు!

- ఈనాడులో అవాస్తవ కథనం, ● మండిపడుతున్న రైతులు





ఎల్లావత్తుల రైస్ మిల్ వద్ద పొలం మధ్యలో ఉన్న 16వ బ్లాక్ పంట కాల్వ, ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనున్న బీడును చదును చేసిన దృశ్యం

ఫ్యాక్ట్ చెక్

ఆళ్లగడ్డ: తెలుగుగంగ 16వ బ్లాక్ పంట కాల్వను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆక్రమించుకున్నారని ఈనాడులో ‘కాల్వ పూడ్చి.. కన్నీళ్లు మిగిల్చి’ అనే శీర్షికన ఆదివారం అవాస్తవ కథనం ప్రచురితం కావడంతో రైతులు మండిపడుతున్నారు. వాస్తవంగా జరిగిందేమంటే.. ఎల్లావత్తులకు చెందిన నరిసింహుడు అనే రైతుకు 35 ఎకరాల పొలం ఉంది. ఇందులో గ్రామ సమీపంలోని రైస్ మిల్ వద్ద 1.60 ఎకరాలు ఉంది. అదే పొలంలో 16వ బ్లాక్ పంట కాల్వ ఉంది. అయితే ఆ పంట కాల్వకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మధ్యలో ఉన్న బీడు పొలం కుటుంబ భాగ పరిష్కారాల్లో నరసింహుడికే వచ్చింది. అక్కడ బీడు ఉండటం వల్ల పంట కాల్వ అవతలివైపున్న పొలానికి వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు కలుగుతుండటంతో ఆ రైతు రెండు రోజులుగా కాల్వకు అటూ ఇటు ఉన్న ముళ్లకంపను తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో అటూ ఇటూ జేసీబీ దాటే క్రమంలో కాస్త మట్టి పంట కాల్వలో జేసీబీ అడెలు పడ్డాయి. అయినా మరుసటిరోజే అదే జేసీబీతో కాల్వలో సాగునీరు పారేందుకు సౌలభ్యంగా చేశాడు. ఇది గమనించని ఈనాడు పత్రిక కాల్వను పూడ్చి కట్టడాలు కట్టినట్లు అవాస్తవ కథనాన్ని ప్రచురించిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి తప్పుడు కథనాలతో రైతుల మధ్య గొడవలు సృష్టించవద్దని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ఎండాకాలంలో ఇలాంటి పనులు చేసుకోవడం సర్వసాధరమైన విషయం అని, సాగునీరు పారే కాల్వను పూడ్చివేసి కట్టడాలు కడితే రైతులు చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. రైతులకు రాజకీయ రంగులు పులమడం తగదని హెచ్చరించారు.

సూదేపల్లెలో వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): సూదేపల్లె గ్రామానికి చెందిన కట్టకాటి శ్రీరాములు(50) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల నుంచి ఈయన కనపడకుండా పోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. అయినా లాభం లేకపోయింది. ఆదివారం ఊరి చివరన చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో భార్య సువర్ణ, కుమార్తె, కుమారుడు శోకసంద్రంలో మునిగారు. శ్రీరాములు ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



ఆదోని సెంట్రల్: స్థానిక రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. మహిళ వయస్సు సుమారు 65 సంవత్సరాలు ఉంటుందని, ఆమె వద్ద ఉన్న బ్యాగులో ఒక చీర, ఇంపోల్ ట్యాబ్లెట్స్ ఉన్నాయన్నారు. అనారోగ్య సమస్యలతోనే ఆమె మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. ఆమె వద్ద ఎలాంటి అధారాలు లభ్యం కాలేదని, గుర్తుపట్టిన వారు తమను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోతుల దాడిలో దుప్పి మృతి



చనిపోయిన దుప్పి

వెలుగోడు: నల్లమల అటవీ ప్రాంతంలోని వైఎస్‌ఆర్ స్మృతివనం సమీపంలో ఆదివారం కోతుల దాడిలో దుప్పి మృతి చెందింది. ఈ విషయాన్ని వెలుగోడు రేంజర్ ఎంఏ ఖాన్ ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి అటవీ అధికారులు చేరుకుని దుప్పి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు.

సావిత్రి బాయి పూలే సేవలు మరువలేనివి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): సావిత్రి బాయి పూలే సేవలు మరువలేనివని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డిపోగు మాట్లాడుతూ.. మహిళల విద్యాభివృద్ధికి సావిత్రి బాయి పూలే ఎనలేని కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాగేశ్వరి నాయుడు, రాష్ట్ర మహిళా ప్రదాన కార్యదర్శి జమీల, మార్కెట్ యార్డు కమిటీ మెంబర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన 108



యువకుడిని 108లో తీసుకెళ్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఓ యువకుడు మూర్ఛవ్యాధికి గురవడంతో బంధుమిత్రులు ఆందోళనకు గురయ్యారు. వారు వెంటనే వైద్యశిబిరం వద్దకు వెళ్లి ప్రాథమిక చికిత్స తీసుకుని 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన ఆదివారం మహానందిలో చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్‌కు చెందిన రాజు కుటుంబ సభ్యులతో మహానందికి వచ్చారు. మూర్ఛవ్యాధికి గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక వైద్యశిబిరం వద్దకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకెళ్లాలని సూచించగా 108 ద్వారా పైలట్ దస్తగిరి, సిబ్బంది తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం అందించడంతో రాజు కోలుకున్నట్లు దస్తగిరి తెలిపారు.